క్లుప్తంగా

దాతల సాయంతో ఆలయ నిర్మాణం



నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మల్లికార్జున పురం వద్ద ఉన్న వంశధార పునరావాస కాలనీలో దాతల సాయంతో ఉమామల్లేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం చేపడుతున్నారు. నిర్వాసితులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన పలువురు దాతలు ఇచ్చిన విరాళాలతో దేవాలయం నిర్మిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ నిర్మాణ కోసం మరింత మంది దాతలు విరాళాలు అందజేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన యూటీఎఫ్ ప్రతినిధులు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

నరసన్నపేట: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, 117 జీఓను రద్దు చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని యూటీఎఫ్ సంఘం ప్రతినిధులు కోరారు. శనివారం నరసన్నపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రమిచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. సంఘం ప్రతినిధులు శ్రీరామ్మూర్తి, కోరాడ వైకుంఠరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



రైల్వే అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: పాతపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.నారాయణ మూర్తి కోరారు. విశాఖపట్నంలో రైల్వే డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాతపట్నం రైల్వే స్టేషన్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడేవారన్నారు. దీనిపై గతంలో ఆనాటి అధికారులకు విన్నవించామన్నారు. అధికారులు టెక్కలి, పాతపట్నం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.1.20 కోట్లు మంజూరు చేశారన్నారు. టెక్కలి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తికావచ్చాయన్నారు. పాతపట్నంలో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరానన్నారు.

స్కూల్ రికార్డుల ఆడిట్



స్కూల్ రికార్డులను ఆడిట్ చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న స్కూళ్లల్లో నిర్వహించిన సివిల్ వర్క్స్, మెయింటెనెన్స్ నిధుల వినియోగంపై ఆడిట్ చేయించుకోవాలని ఆడిట్ అధికారి ఎం.సురేష్ కుమార్ తెలిపారు. శనివారం నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆడిట్ నిర్వహించారు. నాలుగు మండలాల్లోని 44 స్కూళ్లకు చెందిన హెచ్ఎంలు వచ్చి ఆడిట్ చేయించుకున్నారని, మిగిలిన వారు కూడా వచ్చి ఆడిట్ చేయించుకోవాలన్నారు.

పరామర్శ..



లింగాల మధుబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

పాతపట్నం: పాతపట్నం జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి మామ, వ్యవసాయశాఖ ఏడీ లింగాల మధుబాబు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శనివారం పాతపట్నంలోని మధుబాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్ది నారాయణరావు, శిమ్మ రామారావు, వెంకటరావు ఉన్నారు.

● లక్ష తులసీదళార్చన



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శుక్ర విధియ పుస్కరించుకుని శనివారం లక్ష తులసీదళార్చన పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు మావుడూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశ్వక్సేన పూజ, పండిత పరిషత్, అంకురార్పణ, ధ్వజారోహణం తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- సరుబుజ్జిలి

● క్రికెట్ టోర్నీ విజేత ధర్మలక్ష్మీపురం



సారవకోట మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నిర్వహించిన ఆదివాసీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ధర్మలక్ష్మీపురం జట్టు విజేతగా నిలిచింది. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 36 జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ధర్మలక్ష్మీపురం జట్టు 10 ఓవర్లో 91 పరుగులు చేసింది. లక్ష్య చేధనలో కిసస్ లేవస్ జట్టు 50 పరుగులకే ఆలౌట్ అయ్యింది. విజేతగా నిలిచిన ధర్మలక్ష్మీపురం జట్టుకు తహసీల్దార్ జన్ని రామారావు, వాబ యోగేశ్వరరావు, చిన్నాల వెంకట సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

- సారవకోట

● ఆదమరిస్తే అంతే..

సారవకోట మండలంలోని అంగూరు గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న డ్రైనేజీ పైకప్పు విరిగిపోవడంతో ప్రమాదకరంగా ఉంది. జాతీయ రహదారికి పక్కనే నిర్మించిన మురుగు నీటి కాలువ మీద పైకప్పు వేశారు. పనుల్లో నాణ్యత లేక పోవడంతో పైకప్పు విరిగి దాంట్లో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఏమాత్రం ఇక్కడ ఏమర పాటుగా ఉన్నా ప్రమాదం జరుగుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

- సారవకోట



రండిబాబు.. రండి

- సర్కారు బడుల్లో మెరుగైన వసతులు
- ప్రభుత్వ స్కూళ్లల్లో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి
- కార్పొరేటుకు ధీటుగా ఫలితాలు



హిరమండలం సవరచొర్లంగి ప్రాథమిక పాఠశాల



సర్కారు పాఠశాలల్లోని సౌకర్యాలను వివరిస్తున్న ఉపాధ్యాయులు



హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పదో తరగతి మెరిట్ విద్యార్థుల ఫ్లెక్సీ

హిరమండలం: గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పించింది. బోధనలో ప్రత్యేక మార్పులు తీసుకురావడంలో విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు పోటీగా ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో వచ్చిన ఫలితాలు గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ అడ్మిషన్లపై దృష్టిపెట్టారు. పాఠశాలల పరిధిలో ఉన్న సమీప గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే పుస్తకాలు, ఇతర సామగ్రిని వివరిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు సాధించిన ఫలితాల గురించి కరపత్రాలను ముద్రించి తల్లిదండ్రులకు అందిస్తున్నారు. పదో తరగతి ఫలితాలకు సంబంధించి మెరిట్ విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలు ఆయా పాఠశాలల వద్ద ఏర్పాటుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంచేలా మండల విద్యాధికారులకు, ప్రధానోపాధ్యాయలకు ఉన్నతధికారులు మార్గదర్శకత్వం చేస్తున్నారు.

అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుంది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయి. ప్రభుత్వ బడులు ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులు సర్కారు బడుల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రాంబాబు, ఎంఈఓ, హిరమండలం

పీఏసీఎస్ కార్యవర్గం రాజీనామా

పొందూరు: వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మండల పీఏసీఎస్ కార్యవర్గ సభ్యులు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొంచాడ రమణమూర్తి, డైరెక్టర్లు బొమ్మాళి శేషగిరి, గూనాన కృష్ణలు తమ రాజీనామా పత్రాలను పీఏసీఎస్ సీఈఓ పాపినాయుడుకి, జిల్లా సహకార బ్యాంకు అధికారికి, జిల్లా కోఆపరేటివ్ జనరల్ మేనేజర్‌కు అందజేశారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం

శ్రీకాకుళం అర్బన్: బ్రెయిన్ ట్యూమర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మెడికవర్ ఆస్పత్రి కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మురళీధరరావు అన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్ వంటి తీవ్రమైన సమస్య గురించి ప్రజలు తెలుసుకోవడం ద్వారా దానిని నివారించవచ్చునన్నారు. బ్రెయిన్‌లోని కణితుల సమీపంలో కణజాలం, నిర్మాణాలలో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలనే బ్రెయిన్ ట్యూమర్స్ అంటారని వివరించారు. వీటిలో కొన్ని కాన్సర్‌తో సంబంధం లేనివి, మరికొన్ని కాన్సర్‌తో సంబంధం ఉన్నవి ఉంటాయన్నారు. బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురయ్యేవారు, పొగతాగే వ్యక్తుల్లో ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువ ఉంటాయన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం తప్పదన్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

నారాయణ తిరుమలలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న నారాయణ తిరుమల వేంకటేశ్వరుడు



పూలమాల అలంకరణలో కల్యాణ వెంకన్న

శ్రీకాకుళం కల్చరల్:

పీఎన్‌కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. వెంకట రామానుజ సేవాశం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అలాగే పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా పూలమాలతో అలంకరణ చేశారు. అర్చకులు బూరాడ వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు జరిపారు. ఉత్సవ మూర్తులకు కూడా ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మొండేటివీధిలో..

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని అందంగా అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



మొండేటివీధిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

బూర్జ: మండలంలోని 30 పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలపై సిబ్బంది దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు.వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాలువల్లో పూడికలు తీయించాలన్నారు. వీధులను శుభ్రం చేయించి, చేతి పంపుల చుట్టూ, నేల బావుల్లోనూ క్లోరినేషన్ చేయించాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతోపాటు, పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

మండలానికి 8 వేల పాఠ్య పుస్తకాలు



ఎంఈఓ శ్యామసుందరరావు

బూర్జ: మండలానికి 1 నుంచి 10వ తరగతి వరకు 8 వేల పుస్తకాలు అందినట్లు ఎంఈఓ-1 ఎస్.శ్యామసుందరరావు తెలియజేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 8 నుంచి 10వ తరగతికి నేరుగా అనకాపల్లి నుంచి పూర్తిస్థాయిలో పుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు. 1 నుంచి 7వ తరగతికి జిల్లా స్థాయి నుంచి అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి ప్రస్తుతానికి 5 వేలు మాత్రమే అందినట్లు తెలిపారు. మండలానికి 15 వేల వరకు పుస్తకాలకు ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో ఎన్నో లాభాలు ఉన్నాయని విశాఖపట్నానికి చెందిన పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ సీనియర్ పిరమిడ్ మాస్టర్ రేవతి అన్నారు. స్థానికంగా ఆక్స్‌ఫర్డ్, అమర కౌముది, గాయత్రి విద్యా సంస్థలలో పని చేస్తున్న టీచర్లకు ధ్యానంపై రెండురోజులపాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధ్యానం చేయాలంటే శ్వాసమీద ధ్యాస ఉండాలని అన్నారు. ఆరోగ్యపరంగా ఆనందం, ఆలోచనల పరంగా మన వ్యక్తిత్వం మెరుగు పడుతుందని అన్నారు. కోపూరి బిందు మాధవి తదితరులు పాల్గొన్నారు.



ధ్యానంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులతో నాయకులు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల జనసేన నాయకుడు దుక్క బాలరాజు ఆధ్వర్యంలో జెమ్స్ వైద్యులతో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాలను శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 21 మంది యువకులు రక్తదానం చేశారు. 270 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు బాలరాజు తెలిపారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, బీజేపీ పాతపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సలాన శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు



గుత్తావల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎంఈఓ-2 ధనుంజయరావు, ఉపాధ్యాయులు

బూర్జ: భవిత కేంద్రాల్లో ప్రత్యేకావసరాల చిన్నారులకు ఉత్తమ బోధనతోపాటు జీవన నైపుణ్యాలు అలవర్చుకోడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఎంఈఓలు ఎస్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు అన్నారు. మండలంలో ప్రత్యేకావసరాల చిన్నారులను గుర్తించేందుకు మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే ఉంటుందన్నారు. శనివారం గుత్తావల్లి గ్రామంలో సర్వే చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతానికి 38 మంది చిన్నారులను గుర్తించినట్లు ఎంఈఓలు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ, ప్రభుత్వం ద్వారా ఉపకరణాలు అందజేస్తామన్నారు. జిల్లా సహిత సమన్వయకర్త బి.గోవిందరావు ఆధ్వర్యంలో బుద్ధి మాంద్యం, వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు చెవిటి మిషన్లు, చక్రాల కుర్చీలు అందజేయనున్నట్లు తెలిపారు. సహిత విద్యా ఉపాధ్యాయులు డి.రమణ, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



దాశరథీపురం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

కొత్తూరు: మండలంలోని 43 గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సుమారు రూ.12 కోట్ల అంచనా విలువతో 1250 పనులు చేపడుతున్నారు. మండలంలో ప్రతి రోజూ 9850 మంది వతనదారులు పనులకు వెళ్తున్నారు. వేతనాలు రూ.270 నుంచి రూ.300లకు పెంచారు. మండలంలో ప్రధానంగా చెరువులు, సాగు నీటి కాలువలు, గిరిజన గ్రామాల్లో రక్షణ గోడలతోపాటు ట్యాంకులు తవ్వుతున్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ వేతనదారుడు ఉపాధి పనులు వినియోగించుకుంటున్నారు.

రామోజీరావు మృతికి సంతాపం

ఆమదాలవలస: ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం తీరని లోటని టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకితభావంతో పనిచేస్తే ఎటువంటి విజయాన్ని అయినా సాధించవచ్చునని చెప్పడానికి రామోజీరావు జీవితమే ఒక ఉదాహరణ అన్నారు. పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పొందూరు: టీడీపీ మండల కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హిరమండలం: రామోజీరావు చిత్రపటాలకు హిరమండలం జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, పాతపట్నం మండల టీడీపీ అధ్యక్షుడు పైల బాజ్జి ఆధ్వర్యంలో నివాలర్పించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు మెండ మనోహర్ నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు: రామోజీరావు మృతి పత్రిక రంగానికి తీరని లోటని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, మాజీ వైస్ ఎంపీపీ అగతమూడి బైరాగి నాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

సరుబుజ్జిలి: సీజనల్‌గా వ్యాపించే వ్యాధుల పట్ల క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాలవలస, రావివలస, కొండవలస గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్నందున కలుషితనీరు, అపరిశుభ్రమైన వాతావరణం వల్ల డయేరియా ప్రబలే ప్రమాదముందన్నారు. వైద్య సిబ్బంది ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేయాలని సూచించారు.